
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 21 మే 2024





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పట్టమెవరికో..?

27న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక



- కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన తీన్మార్ మల్లన్న
- బీఆర్‌ఎస్ తరుపున ఎనుగుల రాకేష్‌రెడ్డి
- బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి
- హోరాహోరీగా ప్రధాన అభ్యర్థుల ప్రచారం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,73,413 మంది పట్టభద్రులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు 12 జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పట్టభద్రులను ఆకట్టుకునేందుకు ఆత్మీయ సమ్మేళనాలు, వాకర్స్‌తో కలిసి అడుగులేస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితికే ఈ ఉప ఎన్నిక జరుగుతున్నప్పటికీ అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నిక సవాల్‌గా మారింది. వరుసగా గత నాలుగు పర్యాయాలు గెలిచిన ఈ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్‌ఎస్.. మోదీ చరిష్మాతో పాగా వేయాలని కమలం పార్టీ నేతలు విస్తృతంగా శ్రమిస్తున్నారు. దీంతో 27న జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఎవరికి పట్టం కడతారో అనే ఉత్కంఠ నెలకొంది. వివరాల్లోకి వెళితే...

1.73 లక్షల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు..

ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,88,189 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 1,75,645 మంది మహిళ ఓటర్లు, ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,73,413 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,08,349 మంది ఓటర్లు, మహిళలు 65,063 మంది ఓటర్లు, ఇతరులు ఒక్కరు ఉన్నారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 43,812 ఓట్లు, హనుమకొండలో 43,719ఓట్లు ఉన్నాయి. ములుగు జిల్లాలో 10,306 మంది ఓటర్లు, భూపాలపల్లి జిల్లాలో 12,535 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. సిద్దిపేటలో (పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని మండలాల ఓటర్లు) కేవలం 4,679 మంది ఓటర్లే ఉన్నారు. అయితే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో మాత్రం మహిళ ఓటర్ల కంటే పురుష ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. కాగా, ఇప్పటికే నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరగనుంది. ఇందు కోసం ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది.

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వరంగల్	27,038	16,774	00	43,812
హనుమకొండ	25,739	17,990	00	43,729
జనగామ	14,915	8,503	01	23,419
సిద్దిపేట	3,122	1,557	00	4,679
మహబూబాబాద్	22,948	11,985	00	34,933
భూపాలపల్లి	8,000	4,535	00	12,535
ములుగు	6,587	3,719	00	10,306
మొత్తం	1,08,349	65,063	01	1,73,413

కాంగ్రెస్‌లో తీన్మార్ జోష్..

నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజారిటీ లేకపోవటంతో ప్రతీ ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాములునాయక్ నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తీన్మార్ మల్లన్నను ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధిస్తామనే ధీమాతో ఉంది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో తమకు కలిసి వస్తుందనే లెక్కల్లో ఆ పార్టీ ఉంది. అలాగే ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో టీజేఎస్‌తో పాటు సీపీఐ, సీపీఎంలు కూడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలో ఉభయ కమ్యూనిస్టులకు ఓటు బ్యాంకు ఉండడంతో తమకు కలిసి వస్తుందనే ఆశలో కాంగ్రెస్ ఉంది. వీటికి తోడు నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో దాదాపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందినవారే అధికంగా ఉండడంతో గెలుపు ధీమాలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఇక చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. సొంతంగా తీన్మార్ మల్లన్న టీమ్ ఏర్పాటు చేసుకుని గత కొంతకాలంగా మూడు ఉమ్మడి జిల్లాల్లో తన సొంత ఓటు బ్యాంకును పెంచుకుంటు వస్తున్నారు. దీంతో ఈసారి పక్కగా కాంగ్రెస్ గెలుస్తుందనే ధీమాలో ఆ పార్టీ క్యాడర్ ఉంది.

గులాబీకి సవాలే..!

ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల గులాబీ పార్టీకి సవాల్‌గా మారింది. శాసన మండలి పునరుద్ధరణ తరువాత 2007లో తొలిసారిగా వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ విజయం సాధించారు. ఆ తరువాత 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దిలీప్ కుమార్ విజయం సాధించారు. 2015, 2021లో వరుసగా రెండు పర్యాయాలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2007 నుంచి 2021 వరకు నాలుగు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయం సొంతం చేసుకుంది. ఉద్యమ సమయంతో పాటు అధికారంలో ఉన్న సమయంలో కూడా గ్రాడ్యుయేట్ ఓటర్లు గులాబీ పార్టీకి జై కొట్టారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పాటు కీలక నేతలు పార్టీని వీడుతున్న సమయంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపు బీఆర్‌ఎస్ ప్రతిష్ఠాత్మకంగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎనుగుల రాకేష్‌రెడ్డిని ఆ పార్టీలో దించింది. గత నవంబరులో అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి రాకేష్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకుతో పాటు పూర్వ పరిచయాలతో బీజేపీ ఓటు కూడా రాకేష్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతుందనే అంచనాలతో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఈ ఎన్నికను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన భుజస్కంధాలపై వేసుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

బీజేపీలో గెలుపు ఆశలు..

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పాగా వేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. 2007 నుంచి గత నాలుగు పర్యాయాలుగా బీజేపీ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ విజయం మాత్రం చేరువకావటం లేదు. దీంతో లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండటంతో ప్రధానమంత్రి మోదీ హవా వీస్తుందని ఆ పార్టీ భావిస్తుంది. మోదీ చరిష్మాతో పాటు యువత ఓట్లతో ఉప ఎన్నికల్లో విజయం సాధించాలని ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మరోసారి బరిలో దించింది. పార్టీలో అన్ని జిల్లాల నాయకులతో ప్రేమేందర్‌రెడ్డికి పరిచయాలు విస్తృతంగా ఉండడంతో పాటు పార్టీ నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందుతుండటంతో కమలంలోనూ గెలుపు ధీమా వ్యక్తం అవుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సైతం ప్రచారంలోకి దిగడంతో కమలనాథుల్లో జోష్ కనిపిస్తుంది.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి


- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట చర్యలు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి టేబుల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్స్ వంటి మెటీరియల్ సిద్ధం చేయాలని మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారికి సూచించారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశ మార్గాలకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత్రికేయుల కోసం మీడియా సెంటర్‌లో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించాలని, అధికారుల మొబైల్ ఫోన్‌ల కోసం డిపాజిట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట చర్యలు

ఈ నెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. జిల్లాలో 34,933మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఏమైనా సమస్యలుంటే త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఉన్న 58 బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు సిద్ధం చేయాలని, తొర్రూరు జడ్పీహెచ్‌ఎస్, మానుకోట ఫాతిమా హైస్కూల్ నందు ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, అధికారులు నర్మద, నాగవాణి, హరిప్రసాద్, సుబ్బారావు, సురేష్, నర్సింహమూర్తి, సైదులు, భగవాన్‌రెడ్డి, పవన్‌కుమార్, ఎన్నికల సిబ్బంది గణేష్, సందీప్, మాస్టర్ ట్రైనర్స్ రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

'స్థానిక' సమరానికి సిద్ధం



- మొదలైన పంచాయతీ ఎన్నికల సన్నద్ధత
- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ
- మూడు విడతలుగా పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 1688 గ్రామ పంచాయతీలు
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు
- 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- ప్రతీ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ బాక్సులు

5 లో..

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌వో కళావతిబాయి



ఈదులపూసపల్లి ఆయుష్మాన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, మే 20 : ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదులపూసపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఆయుష్మాన్ భారత్ కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలందించాలన్నారు. 12 వారాల్లో గర్భిణులను నమోదు చేయాలని, గర్భిణులకు మొదటి రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చేయించాలని, మూడు, నాలుగు పరీక్షలను జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న స్త్రీ వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. సీ సెక్షన్‌ల ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఔట్ పేషెంట్ సేవలను మెరుగుపర్చాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కొప్పు ప్రసాద్, సౌజన్య, గోవిందమ్మ, సరిత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే భవిష్యత్ బంగారుమయం

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, మే 20: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, చదుకోవాలనే పట్టుదల.. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే లక్ష్యం ఉంటే విద్యలో రాణించి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చి స్కూల్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో రామారావు మాట్లాడుతూ.. పదవ తరగతి ఫలితాల్లో గత సంవత్సరం రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా 22వ స్థానంలో ఉండగా, ఈ విద్యా సంవత్సరం 12వ స్థానంలో నిలిచిందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాల్లో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య బోనగిరి రవీంద్రగుప్తా, ఆకుల శంభయ్య తండా సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, కళ్లెం వెంకట్‌రెడ్డి, సోమ గోవర్దన్, ఇమ్మడి కృష్ణమూర్తి, బొడ్డుపల్లి ఉపేంద్రం, పమ్మి రాజు, దాసరి ప్రసాద్, కాపరబోయిన శ్రీనివాస్, నక్క నాగార్జున, పరందామయ్య, కనకయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచాలి

- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు

వివరాలు : 6 లో..

జిన్నింగ్ మిల్లుల 'పవర్ హాలిడే'

- తాత్కాలికంగా ఉత్పత్తి బంద్
- పత్తి లభ్యత లేకపోవడమే కారణం
- లక్షల్లో నిర్వహణ ఖర్చులు
- జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లులు



కేసముద్రంలో ఉత్పత్తి నిలిపివేసిన పత్తి జిన్నింగ్ మిల్లు



కేసముద్రం, మే 20 : నెలకు లక్షల రూపాయల నిర్వహణ ఖర్చు వస్తుండడంతో పత్తి జిన్నింగ్ మిల్లులు 'పవర్ హాలీడే' ప్రకటించాయి. మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, నర్సింహులపేట, మరిపెడ, పెద్దవంగర మండలాల్లో ఒకటి చొప్పున పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండగా, కేసముద్రం రెండు మిల్లులు వెరసి ఆరు జిన్నింగ్ మిల్లులున్నాయి. ఈ ఆరు మిల్లులు పవర్ హాలిడేలో భాగంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు బంద్ కొనసాగుతున్నాయి. ఒక్కో మిల్లు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. పత్తి జిన్నింగ్ మిల్లులకు నిర్వహణ(మెయింటెనెన్స్) ఖర్చు అధికంగా ఉంటుంది. కరెంటు బిల్లులు, హమాలీ చార్జీలు పత్తి ఉత్పత్తి చేసినా చేయకపోయినా చెల్లించాల్సి ఉంటుంది. ఈ జిన్నింగ్ మిల్లుల్లో మార్కెట్‌లో, నేరుగా మిల్లుల వద్ద ఖరీదు చేసిన ముడిపత్తితో ఉత్పత్తి చేస్తారు. ముడిపత్తిలోంచి పత్తి బేళ్లుగా, గింజలుగా ఉత్పత్తి చేసి విక్రయిస్తారు. క్వింటా పత్తిలోంచి 66 శాతం గింజలు, 32 శాతం పత్తి ఉత్పత్తి అవుతూ 2 శాతం తరుగు పోతుంది. మిల్లుల్లో పనిచేసేందుకు స్థానిక హమాలీలు కాకుండా అధిక శాతం ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి కార్మికులను నియమించుకున్నారు.

రోజుకు 16వేల బస్తాల పత్తి అవసరం..

జిల్లాలోని ఆరు పత్తి జిన్నింగ్ మిల్లులకు వాటి సామర్థ్యాన్ని బట్టి రోజుకు 16వేల బస్తాల ముడి పత్తి అవసరం ఉంటుంది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ముడిపత్తి సీజన్ కాకపోవడంతో 500 బస్తాల పత్తి కూడా అందుబాటులో ఉండడం లేదు. మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లకు నిత్యం 50 నుంచి 200 బస్తాల పత్తి విక్రయానికి వస్తోంది. మార్కెట్‌లో జిన్నింగ్ మిల్లుల వ్యాపారులే కాకుండా ట్రేడింగ్ కంపెనీల వ్యాపారులు సైతం ఖరీదులు చేస్తున్నారు. ట్రేడింగ్ కంపెనీల వ్యాపారులు ఖరీదు చేసిన పత్తిని ఇతర ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు. స్థానిక జిన్నింగ్ మిల్లులకు 50నుంచి వంద బస్తాల వరకే పత్తి అందుబాటులో ఉంటోంది. ఈ ముడిపత్తితో పత్తి జిన్నింగ్ మిల్లులను నడిపించే పరిస్థితిలో లేవు. దీంతో మిల్లుల యాజమాన్యాలు పవర్ హాలిడే వైపునకు మొగ్గు చూపాయి. పవర్ హాలిడేతో యాజమాన్యాలు కార్మికులకు సెలవులు ప్రకటించడంతో వారు తమ స్వరాష్ట్రానికి వెళ్లిపోతారు. ఇటు విద్యుత్ బిల్లులు, అటు కార్మికుల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులన్నింటికి తాత్కాలిక బ్రేక్ వేయనున్నారు.

'పవర్ హాలిడే' అంటే...?

పరిశ్రమల్లో ఉత్పత్తికి ముడి సరుకు సరిపోను లేకపోవడం తో నిర్వహణ కష్టమైన సమయంలో తాత్కాలికంగా మిల్లును మూత వేసే అవకాశాన్ని ప్రభుత్వం యాజమాన్యాలకు కల్పించింది. లేదా ప్రభుత్వమే కరెంటు లభ్యత లేనికాలంలో ప్రత్యేక

మిగతా 6వ పేజీలో

రైతులకు, కార్మికులకు నష్టం ఉండదు

సంకెపల్లి జనార్దన్‌రెడ్డి, జిన్నింగ్ మిల్లు యజమాని, కేసముద్రం



జిన్నింగ్ మిల్లుల పవర్ హాలిడే వల్ల రైతులకు, కార్మికులకు ఎలాంటి నష్టం ఉండదు. జిన్నింగ్ మిల్లులు నడవకున్నా ట్రేడింగ్ కంపెనీల్లో యథావిధిగా పత్తి ఖరీదులు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో నడిచే ఇతర పత్తి జిన్నింగ్ మిల్లులకు ఇక్కడ ఖరీదు చేసిన పత్తి వెళ్తుంది. తద్వారా పత్తి రైతులపై పవర్ హాలిడే ప్రభావం ఏమీ ఉండదు. జిన్నింగ్ మిల్లుల నిర్వహణ భారం తగ్గించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని మిల్లుల యజమానులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

కేంద్రం నిధులతో తెలంగాణ అభివృద్ధి

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు గ్రాడ్యుయేట్లు బుద్ధి చెప్పాలి
- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

తొర్రూరు, మే 20 : ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు కోట్ల రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని రూ.10లక్షల కోట్ల నిధులను బీజేపీ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ శ్రేణులతో కలిసి మాట్లాడుతూ దేశంలో ఇండ్లు లేని నిరుపేదలకు మోదీ 4వేల ఇండ్లు కేటాయించారన్నారు. దేశ వ్యాప్తంగా 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తున్నారని, ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణ అభివృద్ధిలో బీజేపీ వాటా ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జాతీయ రహదారుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని, రామప్ప గుడి కేంద్రం సాకారంతో యునెస్కోకు ఎంపికైందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేస్తే ఉపయోగం లేదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మీడియా పేరుతో అక్రమాలు చేస్తున్నాడని విమర్శించారు. గ్రాడ్యుయేట్లు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రేమేందర్ రెడ్డి కోరారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్లు అందరిని కలవాలని, ప్రజలు దేశంలో మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసే బీజేపీకి ఓట్లు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోదీకి పట్టభద్రులు పట్టం కట్టాలని, నిజాయితీ గల వ్యక్తి ప్రేమేందర్ రెడ్డి అన్నారు. కార్యకర్తలు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్‌ను కలిసి బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు.

సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల అశోక్ రెడ్డి, లేగ రాంమోహన్ రెడ్డి, నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, పల్లె కుమార్, రంగు రాములు, దొంగరి మహేందర్, పూసల శ్రీమాన్, అలిసేరి రవిబాబు, సత్యనారాయణ, యాదగిరి, నరేష్, సుదాకర్, యాకయ్య, శేఖర్, నవీన్, జగదీష్, నరేందర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష వీడాలి

డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ మెడికల్, మే 20 : బాలికల పై వివక్ష వీడాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ, ఎంటీపీ చట్టం, ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణులు పరీక్ష నిమిత్తం, లింగ నిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి తమ ప్రాణాలను ప్రమాదం కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని, ఎవరైనా అప్పటికే అమ్మాయిలు కలిగి ఉండి తిరిగి పుట్టబోయే బిడ్డ ఆగ, మగ తెలుసుకోవడానికి వస్తే వారి వివరాలను తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. అడ్వయిజరీ కమిటీ సభ్యులు జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయి సిబ్బందితో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. వీటితో పాటు ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు సైతం చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాన్ని ఉల్లంఘించిన వారి వివరాలను 104, 1098కు లేదా డయల్ 100కు సమాచారం అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎమ్డీ యాకూబ్‌పాష, గైనకాలసిస్టులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ ఏ.నిరంజనదేవి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎఫ్ఎంఎం స్వచ్ఛంద సంస్థ నుంచి ఇ.శ్రీకాంత్, సర్వోదయ యూత్ కవిరాజ్, ప్రసన్న కుమార్, మాదవరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు

జర్నలిస్టులకు క్రీడా పోటీలు

వడ్డెపల్లి, మే 20: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్‌లో సభ్యులైన జర్నలిస్టులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న జర్నలిస్టులు ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రెస్‌క్లబ్‌కు నేరుగా వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

విధుల్లో చేర్చుకోవాలని అటెండర్ నిరసన



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అటెండర్ పార్వతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 20: తనను విధుల్లో చేర్చుకోవాలని మహిళా అటెండర్ పార్వతి మహబూబాబాద్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అటెండర్ పార్వతి మాట్లాడుతూ.. తాను 2017 నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో పాఠశాలల పనిదినాల ముగింపు వరకు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం రెన్యువల్ చేసి మళ్లీ విధుల్లోకి తీసుకుంటారని పేర్కొన్నారు. తాను 20 రోజులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికి ఈ విద్యా సంవత్సరం తన విధులను రెన్యువల్ చేయలేదని వాపోయారు. కార్యాలయంలో తనతో ఎవరు మాట్లాడడం లేదని, తాను కిందనే కూర్చుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తనను రెన్యువల్ ఎందుకు చేయలేదని డీఈవోను అడిగినట్లు చెప్పారు. దీంతో సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. తన పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని అటెండర్ పార్వతి వేడుకున్నారు. ఈ విషయంపై డీఈవో రామారావును వివరణ కోరగా... పార్వతి సరిగ్గా విధులు నిర్వహించక పోవడంతోనే ఈ సంవత్సరం రెన్యువల్ చేయలేదని పేర్కొన్నారు.

సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఏపీడీ శాంతకుమారి



మహబూబాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఏపీడీ శాంతకుమారి

మహబూబాబాద్ రూరల్, మే 20 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని మహబూబాబాద్ ఈజీఎస్ ఏపీడీ శాంతకుమారి అన్నారు. మహబూబాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పంచాయతీ కార్యదర్శులు ఏడు రికార్డులను తప్పనిసరిగా మెయింటెనెన్స్ చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కొన్ని గ్రామాల్లో ఎండిపోయాయని వాటి స్థానంలో తిరిగి నాటి రక్షించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద తాగునీరు, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. మొదటి రోజు సింగారం, రెడ్యాల, సాదుతండాతో పాటు మరో ఆరు గ్రామాల సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.40వేల జరిమానాను పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలకు విధించినట్లు చెప్పారు. పీఆర్ ఏఈ రాజశేఖర్‌కు 41 గ్రామ పంచాయతీలు ఉండగా ఈజీఎస్ కింద 80 సీసీరోడ్లు మంజూరు కాగా, వాటి పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీ బృందానికి 39 రికార్డులు మాత్రమే ఇచ్చారని, మిగతా 41 పనులకు సంబంధించిన రికార్డులు అందించకపోవడం గమనార్హం. కాగా, మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ చేస్తుండగా ఫ్యాన్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ సామాజిక తనిఖీలో ఏపీవో రమేష్ రెడ్డి, ఎస్ఆర్‌పీలు కుమార్, నాగరాజు, పీఆర్ ఏఈ రాజశేఖర్, టీఏలు సంతోష్‌కుమార్, ఓంకార్, కిశోర్, నవీన్‌కుమార్, ఎఫ్ఏలు గాంధీ, నర్సయ్య, సుజాత, ఉమ, వీరన్న పాల్గొన్నారు.

ఉపాధి చట్టం రక్షణకై ప్రజాపోరాటం


మరిపెడ రూరల్, మే 20 : ఉపాధి హామీ పథకం రక్షణకై ప్రజాపోరాటం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని బాల్ని ధర్మారంలో పుచ్చలపల్లి సుందరయ్య 39 వర్ధంతిని పురస్కరించుకొని ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ఉపాధి కూలీల నోట్లో మట్టి పడిందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉపాధి చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి అనేక సవరణలు చేసి నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి చట్టాన్ని రక్షించుకోవడం కోసం మే 31 జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాణాల రాజన్న, కుమ్మరికుంట్ల వెంకన్న, వెంకటరెడ్డి, గోపయ్య, పిచ్చయ్య అర్జున్, నాగమణి, పిచ్చమ్మ, నరసింహా, బాల్యా నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య

'స్థానిక' సమరానికి సిద్ధం

మొదలైన పంచాయతీ ఎన్నికల సన్నద్ధత



- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ
- మూడు విడతలుగా పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 1688 గ్రామపంచాయతీలు
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు
- 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- ప్రతీ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ బాక్సులు

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు పూర్తికావస్తుండడంతో అధికార యాంత్రాంగం పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. తాజాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు చాలినన్ని సమకూర్చుకోవాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పదవీకాలం ముగిసే పంచాయతీలతో పాటు ఎన్నికలు జరగని, కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే దిశగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. జూన్ 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ప్రక్రియ అయిపోగానే లోకసభ ఎన్నికల ఘట్టం ముగిసిపోతుంది. ఆ వెంటనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలు కానున్నది.

బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉంటారు. అంతమందికి ప్రస్తుతం ఉన్న ఈవీఎంలు సరిపోవు. పైగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా పార్టీ గుర్తులు ఉండవు. అందుకనే పంచాయతీ ఎన్నికల్లో మొదటి నుంచి బ్యాలెట్ బాక్సులనే ఉపయోగిస్తున్నారు. ఈ దృష్ట్యా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి? ఇంకా అదనంగా ఎన్ని బాక్సులు అవసరమవుతాయి? ప్రస్తుతం ఉన్న బ్యాలెట్ బాక్సుల్లో సక్రమంగా ఉన్నవి ఎన్ని? వీటిలో మరమ్మత్తు చేయాల్సినవి ఎన్ని? తదితర వివరాలు పంపాల్సిందిగా ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను కోరారు.అలాగే పోలింగ్ సిబ్బందికి ఆర్వో బుక్‌లు ఏ మేరకు అవసరం అవుతాయో కూడా వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఆర్వో బుక్‌లు సైతం ఎక్కువ సంఖ్యలోనే అవసరమవుతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఆరు జిల్లాల డీపీవోలు గతంలోనే ఈ వివరాలను పంపినప్పటికీ తాజాగా మరో సారి సమాచారాన్ని సేకరించి పంపే పనిలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బ్యాలెట్ బాక్సులు సరిపడ ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018లో ఉమ్మడి జిల్లాలో 1060 పంచాయతీలు మాత్రమే ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం 500జనాభా కన్నా మించి ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చడంతో వాటి సంఖ్య 1688కి పెరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మొత్తం 1688 పంచాయతీల్లో 83 మేజర్ గ్రామ పంచాయతీలు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పునర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకు ముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగాయి. హనుమకొండ జిల్లాలో పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.

లోక్‌సభ ఎన్నికలతో ఆలస్యం

కిందటిసారి పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో మూడు దశల్లో జరిగాయి. అన్ని పంచాయతీల్లో ఫిబ్రవరి 1 నాటికి సర్పంచ్‌తో సహా కార్యవర్గాలు కొలువు తీరాయి. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 2తో ముగియడంలో ఆ వెంటనే ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. వాస్తవానికి జనవరిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ఉద్యోగుల వివరాలు సేకరణతోనే సరిపెట్టారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడడంతో వాటిపై దృష్టి సారించి పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను తాత్కాలికంగా పక్కనపెట్టారు. నిజానికి పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే అసెంబ్లీ, ఆతర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా ఆలస్యమైంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయి కొత్త శాసన సభ కొలు వుదీరిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలు పెట్టింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారుల నియామకం, ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వడం తదితర కార్యక్రమాలను ప్రారంభించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ గత సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు.

బ్యాలెట్ పద్ధతిలో....

ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలతో పాటు పాతపంచాయతీలకు ఎన్నికలన్నిటికి ఎన్నికలు నిర్వహిస్తారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గోరికొత్తపల్లిని ఇటీవలే గ్రామపంచాయతీగా మార్చారు. దీనికి మొదటిసారి ఎన్నికలు జరుగనున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుపుతారు. పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లోనూ నోటా గుర్తు ఉంటుంది. ఎప్పటిలాగే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఉప సర్పంచ్‌లను చేతులు ఎత్తడం ద్వారా పాత పద్ధతిలోనే ఎన్నుకుంటారు. ఏదైనా కారణంతో ఉప సర్పంచ్ ఎన్నిక అదే రోజు సాధ్యం కాకపోతే మరుసటి రోజు నిర్వహిస్తారు. 2019లో జనవరి 21, 25,30 తేదీల్లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరిగింది. నాడు కొత్త సంవత్సరం తొలి రోజునే ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది.

గుర్తులపై కాకుండా...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులపై పోటీ ఉండదు.

ప్రధాన పార్టీల మద్దతుదారులు పోటీ చేస్తా రు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇది వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే అధిక సంఖ్యలో సర్పంచులుగా ఉన్నారు. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పంచా యతీ ఎన్నికల పోరు ఆసక్తిగా మారనున్నది.

రిజర్వేషన్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు మారతాయా? లేక పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా? అనే సందిగ్ధత నెలకొంది. నిజానికి పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లనే యాధాతదంగా కొనసాగాలి. కానీ కొత్త ప్రభుత్వం చట్ట సవరణ చేస్తే రిజర్వేషన్లు మారవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శులు ఇప్పటికే సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధించిన రిజర్వేషన్లపై వివరాలు పంపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషను పదేళ్లకు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం 2019లో చట్టం చేసింది. ఈ నేపథ్యంలో కిందటి సారి రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. ఒక వేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్లను మార్చాలని నిర్ణయం తీసుకుంటే అధికారులు నిర్ణీత సమయంలో కొత్త రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలు అందిస్తే తప్ప రిజర్వేషన్లు మారే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మూడు విడతలుగా..

పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఒక్కో రెవెన్యూ డివిజన్‌లో ఒక విడతలో ఎన్నికలు ఉండనున్నాయి. 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్, 201 నుంచి 400 ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రాల్లో ఒక ప్రిసైడింగ్ ఆధికారులు, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్లు ఉండే కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఏడు వేల మంది సిబ్బంది అవసరం ఉండవచ్చునని అంచనా. ఉమ్మడి జిల్లాలోని సర్పంచులు, ఉపసర్పంచుల వివరాలను ఇది వరకే పంపించారు. తాజాగా ఎన్నికల నిర్వహణకు సిబ్బంది వివరాలు పంపించాలని ఆదేశాలు వచ్చాయి. ఇటీవల శాసన సభ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండడటంతో వాటిని టి-పోల్ వెబ్ సైట్‌లో నమోదు చేసే పనిలో ఉన్నారు. త్వరలో వారికి పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగుల సంఖ్య సరిపోని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ రంగ సంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఏయిడెడ్ పాఠశాలలు, ఇతర సంస్థల సిబ్బందికి విధులు కేటాయించనున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుంది. ప్రతీ కేంద్రంలో ఒక బ్యాలెట్ బాక్సు వార్డు సభ్యుడి ఎంపికకు, మరో బాక్స్ సర్పంచ్ ఎన్నికకు ఏర్పాటు చేస్తారు. ఇదే లెక్కలు సరి చూసి బ్యాలెట్ బాక్సులను అధికారులు అంచనా వేస్తున్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 20 : అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అందచేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పుట్టా మధు గత ఫిబ్రవరి 3న అనారోగ్యంతో మరణించాడు. తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.7 లక్షల 89 వేలు మంజూరు చేయడం జరిగింది. చెక్కును సోమవారం కాని స్టేబుల్ సతీమణికి కమిషనర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, పరిపాలనాధికారి రామకృష్ణ, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొ న్నారు.

మాటలు రాని పిల్లల కోసం యాప్

వరంగల్ మెడికల్, మే 20 : మాటలు సరిగా రాని పిల్లల కోసం నిట్ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కేవీ కాదంబరి ఆధ్వర్యంలో ఒక ప్రాథమిక మొబైల్ అప్లికేషన్ (యాప్) తయారు చేశారు. ఎంజీఎం డీఈఐసీ సెంటర్‌కు వచ్చే పిల్లల కోసం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ ఈ యాప్ వల్ల పిల్లలకు పదజాలం పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, నిట్ విద్యార్థులు ఆదర్శ్‌రావు, సయ్యద్ ఫర్హాన్ నిజాముద్దీన్, వనజ, స్పీచ్ థెరపిస్టు డాక్టర్ మంజుల నాయక్, అనిల్, ప్రశాంత్, అమూల్య, రమేశ్, సంపత్ కుమార్, మాధవిపాల్గొన్నారు.

నేడు డాక్టర్ రేవూరికి సహృదయ పురస్కారం

హనుమకొండ కల్చరల్, మే 20 : నగరంలోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వడ్డెపల్లిలోని పీఆర్ రెడ్డి ఫంక్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ప్రసారభారతి అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు సహృదయ ప్రత్యేక పురస్కారాన్ని అందజేస్తున్నట్లు అధ్యక్షులు గిరిజా మనోహర్‌బాబు చెప్పారు. సహృదయ వ్యవస్థాపక సభ్యులు స్వర్గీయ రాళ్లబండి కవితా ప్రసాద్ పేరిట ప్రతియేటా ఒక ప్రముఖ అధికార గణానికి అందజేస్తున్న సహృదయ అనుబంధ స్మారక పురస్కారాన్ని ఈసారి అనంత పద్మనాభరావుకు అందజేస్తున్నామన్నారు. భారత చరిత్ర పరిశోధన పరిషత్ పూర్వ అధ్యక్షులు ఎల్లాప్రగడ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు.

జాతీయ రహదారి రక్తసిక్తం

రెండు ప్రమాదాల్లో ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్



లారీని ఢీకొని ధ్వంసమైన కారు

కాటారం, మే 20: భూపాలపల్లి కాటారం మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి-353 (సీ) రక్తసిక్తమైంది. ఆదివారం రాత్రి, సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం...

భూపాలపల్లి కృష్ణకాలనీకి చెందిన సింగరేణి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కోదాది శ్యామ్‌కుమార్(30), ఠాకూర్ పృథ్వీ ఆదివారం రాత్రి తమ స్నేహితుడిని బైక్‌పై ఎక్కించుకొని మండలంలోని బయ్యారంలో అతడి ఇంటి వద్ద డ్రాప్ చేశారు. తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిలోని కమలాపూర్ క్రాస్ సమీపంలో మేడిపల్లి అటవీ ప్రాంతంలో బైక్ నడుపుతున్న పృథ్వీ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చున్న శ్యామ్ కుమార్ ఎగిరి భూపాలపల్లి నుంచి కాళేశ్వరం వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం కింద పడ్డాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పృథ్వీ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు 108 అంబులెన్స్‌లో వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్యామ్‌కుమార్‌కు భార్య దివ్య, పాప, బాబు ఉన్నారు.

మేడిపల్లి అటవీప్రాంతంలోనే సోమవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. భూపాలపల్లి నుంచి చిన్నతూండ్లకు వెళ్తున్న వెంకటేశ్ బైక్‌ను వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న కారుకు డ్యాష్ ఇచ్చి మరో కారును ఢీకొట్టాడు. దీంతో రెండో కారులో ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ఏమీ కనిపించక ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదఘటనలో బైక్ నడుపుతున్న వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. రెండు కార్లు ధ్వంసమైనప్పటికీ ఎవరికీ ఏమీ కాలేదు. సంఘటన స్థలానికి ఎస్సై అభినవ్ చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ధ్వంసమై రోడ్డుపై ఉన్నవాహనాలను పక్కకు తొలగింపజేశారు. రెండు ప్రమాద సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దివి నుంచి భువికి..!

తెల్లని మబ్బుల కనువిందు- బయ్యారం పెద్దగుట్ట ప్రాంతంలో ఆవిష్కృతం

ఆకాశంలో తేలాడే తెల్లని మబ్బులు కాసేపు దివి నుంచి భువికి చేరినట్లుగా కనువిందు చేశాయి. ఆకాశం మేఘావృతం కాగా తెల్లని మబ్బులు భూమిని తాకుతున్నట్లు కనిపించాయి. ఈ దృశ్యం మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద గుట్ట ప్రాంతంలో సోమవారం మిట్ట మధ్యాహ్నం ఆవిష్కృతమైంది. పెద్ద గుట్టను తాకినట్లు కనిపిస్తున్న ఈ తెల్లని మబ్బు దృశ్యాలను పలువురు ఔత్సాహికులు తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు.

- బయ్యారం

నేడు నవీన్ 'అనురాగదీపం' నవలావిష్కరణ



హనుమకొండ కల్చరల్, మే 20 : చారిత్రక ఓరుగల్లుకు నవలా సాహిత్యంలో కేంద్ర సాహిత్య పురస్కారాన్ని సంపాదించిపెట్టిన ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ కలం నుంచి జాలువారిన 35వ నవలా అనురాగదీపం ఆవిష్కరణ మంగళవారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని పాపడం బ్లూలో నిర్వహిస్తున్నట్లు అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ కార్యదర్శి డి.స్వప్న, డాక్టర్ ఏ.రాజ్‌కుమార్ తెలిపారు. గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గంటా రామిరెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. నెల్లుట్ల రమాదేవి నవీన్ నవలను పరిచయం చేస్తారు. అమ్మంగి వేణుగోపాల్, పట్టణం వాసు, ఏ.వరలక్ష్మీ తదితరులు వక్తలుగా పాల్గొంటారు.

డాక్టర్ నవీన్ తన భార్య అనసూయతో గడిపిన 60 ఏళ్ల దాంపత్య జీవితాన్ని చిత్రిస్తూ ఆయన రాసిన నవల అనురాగదీపం. తన అర్ధాంతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమెతో ఎదురైన కష్టనష్టాలను మధుర క్షణాలను కలగలిపి తన కలంలో ఇంకుగా మార్చి రాసిన నవలే అనురాగదీపం. ఇప్పటి వరకు నవీన్ రాసిన 34 నవలలు ఒక ఎత్తు అయితే తన జీవితాన్ని అనురాగ దీపంతో తేజోమయం చేసిన అర్ధాంతి అనసూయ ఎడబాటును తట్టుకోలేక మదనపడుతూ ఆవేదన చెందుతూ కన్నీళ్లతో హృదయాన్ని చీల్చుకొని వచ్చిన ఈ నవల ఒక ప్రత్యేకంగా మిగలనుంది. ఈ నవలలో నవీన్ స్వగ్రామం వావిలాలలో వ్యవసాయ కుటుంబ నేపథ్యంలో తన సతీమణి అనసూయ పుట్టిన సూర్యాపేట పరిసర మద్దిరాల గ్రామ వాతావరణ నేపథ్యంలో ఆనాటి భూస్వామ్య కుటుంబ నేపథ్యం అప్పటి పరిస్థితులను అద్భుతంగా చిత్రీకరించారు.

మేలిమి మీనా..

ఎల్గూరు రంగంపేట చెరువులో వలకు చిక్కిన వింత చేప

సంగెం, మే 20: వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఎల్గూరు రంగంపేట గ్రామంలోని చెరువులో మత్స్యకారులకు వింత చేప లభ్యమైంది. సోమవారం చెరువులో మత్స్యకారుడు బోనాల మహేందర్ చేపల వల కు ఇది చిక్కింది. బంగారం రంగులో ఉండి, ఒంటిపై చిన్న చిన్న చారలు ఉండి వింత గోలిపేలా ఉంది. అరకిలో మేర బరువు ఉండటంతో మత్స్యకారులు, గ్రామస్థులు వింతగా తిలకించారు. గతంలో ఇలాంటి చేపను ఎప్పుడూ చూడలేదన్నారు.



రుణమాఫీపై కసరత్తు

- సీఎం ప్రకటనతో బ్యాంకు అధికారుల అప్రమత్తం
- ఆగస్టు 15కు అందించేలా లెక్కలు తీస్తున్న సిబ్బంది
- జిల్లాలో రూ.800 కోట్ల మేరకు మాఫీకి అవకాశం
- లబ్ధిపొందనున్న సుమారు 85వేల మంది రైతులు
- మ్యాపింగ్ తర్వాతే మాఫీపై స్పష్టత
- మార్గదర్శకాలతో కోసం ఎదురుచూస్తున్న బ్యాంకులు

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏదేమైనా ఆగస్టు 15వ తేదీలోపు రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసి తీరుతామని లోకసభ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకుల అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలోపు రుణమాఫీకి సంబంధించిన లెక్కలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రైతుల రుణబకాయిలు ఏ మేరకు ఉన్నాయి? వారిలో రూ.2లక్షలలోపు రుణమాఫీకి ఎంతమంది అర్హులు అనేది తేల్చేందుకు రికార్డులను పరిశీలించే పనిలోపడ్డారు. హనుమకొండ జిల్లాలో లక్షా 10వేల మంది రైతులు ఉండగా, వీరిలో సుమారు 85వేల మంది రుణమాఫీ ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంది. ఈ క్రమంలో సుమారు రూ.800కోట్ల మేరకు రుణ మాఫీ జరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

మార్గదర్శకాలు ఏవీ?

రుణమాఫీ ఎప్పటిలోగా రుణాలు తీసుకున్నవారికి వర్తిస్తుందనేదికి సంబంధించి కటాఫ్ వివరాలు సూత్రప్రాయంగా వెల్లడయ్యాయి. కానీ అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉంది. రుణ మాఫీ ప్రక్రియ విధి విధానాలు, మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం జారీ చేయాల్సి ఉన్నది. కొత్త ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల్లో ఏ మేరకు మార్పులు, చేర్పులు ఉంటాయి? రుణమాఫీకి సంబంధించి అనుసరించే విధివిధానాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వంకన్నా భిన్నంగా ఉంటాయనేది తెలియాల్సి ఉంది. బ్యాంకు అధికారులు వీటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను బట్టి వారు రుణమాఫీ ఏర్పాట్లు చేస్తారు. రుణమాఫీని కుటుంబంలో ఒక రైతుకే పరిమితం చేస్తారా? లేదా ఎంతమంది తీసుకుంటే అంత మందికి మాఫీ వర్తిస్తుందా? అనేదానిపై స్పష్టత రావలసిఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతులకు ఇచ్చిన రూ. 2 లక్షల రుణ మాఫీ ముఖ్యమైంది. ఈ హామీపై చాలామంది రైతులు ఆశలు పెట్టుకున్నారు. రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ఇచ్చిన హామీ పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కటాఫ్ తేదీలు

2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబర్ 10 మధ్య రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న, రెన్యూవల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుందని గతంలో ప్రభుత్వం సూత్రప్రాయంగా ప్రకటించింది. దీని ప్రకారం అర్హులైన వారి జాబితా పంపాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లను రాష్ట్ర అధికారులు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ బ్యాంకులే పెద్దఎత్తున పంట రుణాలను మంజూరు చేశాయి. కొన్ని వాణిజ్య బ్యాంకులు కూడా జిల్లా రుణ వార్షిక ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రైతులకు పంట రుణాలు ఇచ్చాయి. జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం 2023లో వివిధ బ్యాంకులు రూ.1600కోట్ల మేరకు రుణవితరణ చేశాయి. ఇందుల్లో కనీసం 50 శాతం మంది రైతులైన అర్హత సాధించే అవకాశం ఉంది. ఆ లెక్కన రూ.800కోట్ల మేరకు రుణమాఫీ జరగవచ్చునని భావిస్తున్నారు. పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో 80శాతం మంది సన్న, చిన్నకారు రైతులే. రుణాలు తీసుకున్న రైతుల జాబితా తయారు చేయాల్సిందిగా ఒకటి రెండు రోజుల్లో ఆదేశాలు రానున్నట్టు సమాచారం.



గతంలో..

గత ప్రభుత్వం రైతులకు నాలుగేళ్లలో దశల వారీగా రుణమాఫీ వర్తింపజేసింది. రూ.25వేలు, రూ.50వేలు, ఆ తర్వాత లక్షలోపు రుణాలు మాఫీ చేసింది. వివిధ కారణాల వల్ల సుమారు 30వేల మంది రైతులకు ఇంకా రుణ మాఫీ జరగలేదు. రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించుకోని వారికి మాఫీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ప్రకటించే కటాఫ్ తేదీల్లో వీరికి కూడా రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనేది తెలియదు. ప్రకటించబోయే కటాఫ్ తేదీ పరిధిలోకి వస్తారో లేదో కూడా అస్పష్టంగానే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి రైతులు సహకార సంఘాల్లో ఎక్కువగా ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం భూములను అమ్ముకున్నవారు, పిల్లల పెళ్లిళ్ల అవసరాలకు బదలాయించిన వారిలో ఎవరైనా కటాఫ్ తేదీల మధ్య రుణాలు చెల్లిస్తే వారికి రుణ మాఫీ వర్తిస్తుంది. ఇతర అవసరాలకు అప్పులు చెల్లించిన పట్టా పుస్తకాలు, డాక్యుమెంట్లు తీసుకున్నవారు చాలామంది ఉన్నారు.

మ్యాపింగ్

రుణాలు తీసుకున్న రైతుల మ్యాపింగ్ చేయాల్సి ఉంది. ఈ దిశగా కూడా అధికారులు దృష్టి సారించారు. వాస్తవానికి ఈ పని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరగాల్సి ఉండింది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ కావడంతో అధికారులు ఈ ప్రక్రియ జోలికి వెళ్లలేదు. రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలలోపు ఇలా తమ అవసరాల మేరకు రైతులు రుణాలు తీసుకున్నారు. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. వీరంతా ఒక కేటగిరి. తనపేరుమీదనే కాకుండా తన భార్య పేరు మీద రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. ఇటువంటి రుణాలకు సంబంధించిన ఫ్యామిలీ గ్రూపింగ్ సరిగా కాలేదు. ఇంటువంటి వారికి గతంలో రుణమాఫీ జరగలేదు. కొందరు రైతులు రెండు చోట్ల పంట రుణాలు తీసుకున్నారు. ఇటువంటి మల్టిపుల్ బ్యాంకు రుణాల మాఫీ సైతం ఆగింది. దీనిని కూడా మ్యాపింగ్ చేయాల్సి ఉంది. ఆధార్‌కార్డు మిస్ మ్యాచింగ్ అయి రుణాలు మాఫీ కాని రైతులు కూడా ఉన్నారు. ఈ కేటగిరి కింది రైతులను సైతం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నది. మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టేందుకు బ్యాంకు అధికారులు పూనుకున్నప్పటికీ ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అది కుంటుపడింది. మరో బ్యాంకులో ఎక్కువ రుణం తీసుకోవడానికి నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం ఉండడంతో ఇంతకు ముందు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించి ఖాతాలను మూసేసుకున్న రైతులు కూడా కొందరు ఉన్నారు. వీరికి కూడా గతంలో రుణమాఫీ జరగలేదు. వీరికి కూడా రుణమాఫీ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది కానీ ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం రుణమాఫీ అర్హత కిందకు రైతులు రావడానికి ఇలాంటి ఖాతాలను కూడా గుర్తించి వాటిని మ్యాపింగ్ చేయాల్సి ఉన్నది. వివిధ కేటగిరీల కింద పంట రుణాలు తీసుకున్న రైతుల మ్యాపింగ్ లేకపోవడంవల్ల రుణమాఫీపై స్పష్టత లేకుండా పోయింది. ఎంత మంది రైతులు ఏ కేటగిరీ కింది వచ్చేది స్పష్టమైతే వారికి రుణమాఫీ వర్తించే విషయంలో బ్యాంకులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. వీటిపై కూడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావలసి ఉంది.

మార్గదర్శకాలు రావాలి

శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, హనుమకొండ జిల్లా

రూ2.లక్షల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావలసి ఉంది. దీనితో పాటు రుణమాఫీకి కటాఫ్ తేదీని కూడా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇది జరిగితేనే జిల్లాలో ఎంత మంది రైతులకు ఏ మేరకు రుణమాఫీ జరగుతుందని కచ్చితంగా చెప్పడానికి వీలుకలుగుతుంది. జిల్లాలో పంట రుణాల కింద రూ.1600కోట్ల మేరకు వితరణ జరిగింది. ఇందులో సుమారు 50మంది రైతులు మాఫీకి అర్హత కలిగి ఉంటారు. అ లెక్కన దాదాపు రూ.800కోట్ల మేరకు రుణ మాఫీ జరిగే అవకాశం లేకపోలేదు.

ఆయిల్‌పామ్ సాగు పెంచాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 20 : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడు కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యాన, వ్యవసాయాధికారుల సమీక్ష సమావేశంలో ఇరువురు మాట్లాడారు. రైతులందరు పంట మార్పిడి చేసి ఆయిల్‌పామ్ తోటలు వేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్‌పామ్ పంటలతో స్థిరమైన ఆదాయం వస్తుందని, ఎకరాకు రూ.లక్ష వరకు వస్తుందని చెప్పారు. సమావేశంలో మహబూబాబాద్, మరిపెడ డివిజన్ల వ్యవసాయ సహాయసంచాలకులు లక్ష్మీనారాయణ, రాజనరేందర్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

పది ప్రత్యేక తరగతులను పరిశీలించిన డీఈవో

కేసముద్రం, మే 20 : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావు పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి తరగతులు ఎలా ఉపయోగపడుతున్నాయనే అంశాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణులు కావాలని సూచించారు. నోడల్ అధికారి కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం బి.రాజు, ఎం.సదయ్య, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.

సీపీఐ పోరాటాలతోనే ఉపాధి కూలీలకు సౌకర్యాలు

కేసముద్రం, మే 20 : మండలంలోని అమీనాపురం ఉపాధి హామీ కూలీలకు సీపీఐ పోరాటాలతోనే కనీస సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారని మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవలె సౌకర్యాలు లేని విషయాన్ని అధికారుల దృష్టికి పత్రికల ద్వారా తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కందిపాటి శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ చీపిరి మల్లయ్య కూలీలకు టెంటు, తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచారని తెలిపారు. ఆయన వెంట పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి దాసరి లింగస్వామి ఉన్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ ఉన్న రైతులకు రైతుబంధు ఇవ్వాలి

కొత్తగూడ, మే 20 : ఆర్‌వోఎఫ్‌ఆర్ కలిగి ఉన్న రైతులకు రైతుబంధు ఇవ్వాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాము డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాము మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు గత ప్రభుత్వాలు అటవీహక్కు చట్టం-2006 కింద ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చాయని పేర్కొన్నారు. కానీ, ఆర్‌వోఎఫ్‌ఆర్ ఉన్న రైతులకు రైతుబంధు వేయటం లేదన్నారు. రైతుబంధు అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, ఇర్ప రవి, ముత్తయ్య, ఈసం సమ్మయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం



శైలజకు లీడర్‌షిప్ అవార్డు అందిస్తున్న బాబూరావు

తొర్రూరు, మే 20 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవ చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లీడర్ షిప్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు అన్నారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లో నిర్వహించిన మల్టీపుల్ కన్వెన్షన్ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు వజినపల్లి శైలజకు ఇంటర్నేషనల్ లీడర్ షిప్ మెడల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సేవ చేయడం అభినందనీయం అన్నారు. లయన్స్ క్లబ్ గత 107 సంవత్సరాలుగా ఇంటర్నేషనల్ ద్వారా తెలంగాణ ప్రాంతంలో మల్టీపుల్‌గా విస్తరించి 8 లయన్ జిల్లాల సౌజన్యంతో నిస్వార్థ సేవలందించడం హర్షనీయమని తెలిపారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, సభ్యులు లక్ష్మి నర్సింహరావు, విశారద, నాగవాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరువొద్దు

మహబూబాబాద్ టౌన్, మే 20: స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ వారిని ఎదిరించిన సమరయోధుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని వారి సేవలను ఎన్నడూ మరువొద్దని నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు అన్నారు. మహబూబాబాద్‌లో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేక్, లక్ష్మీనారాయణ, గంటా వెంకటరమణారెడ్డి, నాగేందర్, దామోదర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మనోజ్, పురోహిత్, సుదర్శనం పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక ప్రేమేందర్‌రెడ్డి

- మోదీ సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మహబూబాబాద్‌రూరల్, మే 20: శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రశ్నించే గొంతుక అవుతారని, దీంతో పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులను సోమవారం ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రేమేందర్‌రెడ్డి విద్యార్థి దశలోనే బీజేపీలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, పట్టభద్రులందరు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థి గెలుపుకు నాందిపలుకుతాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా ధరణి సమస్య తీర్చలేదని, దీంతో రైతుబంధు, రుణమాఫీ ఆగిపోయిందని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను నేటికి విడుదల చేయలేదని చెప్పారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి నేటికి అమలుకు శ్రీకారం చుట్టలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, ఎడ్ల అశోక్‌రెడ్డి, యాప సీతయ్య, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, శశివర్ధన్‌రెడ్డి, మొసంగి మురళి, వల్లభు వెంకటేశ్వర్లు, ఆకులశ్రీనివాస్, రాచకొండ కొమురయ్య, కాలేరు నేతాజీ, ఇందుభారతి, భాస్కర్‌రెడ్డి, తుంపిళ్ల శ్రీనివాస్, కీసర పద్మాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాధాపటేల్ తదితరులు పాల్గొన్నారు.

● మరిపెడ : నీతి, నిజాయితీకి మారుపేరు అయిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పట్టభద్రులకు పిలుపునిచ్చారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని వినూత పబ్లిక్ స్కూల్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమావేశం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి మారే నేటి రోజుల్లో ఒకే సిద్ధాంతాన్ని నమ్ముకొని 40ఏళ్లుగా బీజేపీలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా ప్రేమేందర్ రెడ్డి ప్రజల కోసం పోరాడుతున్నారన్నారు. అట్లాంటి నిబద్ధత కలిగినోళ్లను చట్టసభలకు పంపించే బాధ్యత పట్టభద్రులదేనని గుర్తుచేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వైవీ రావు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ జగన్, భూక్యా సంగీత, గుగులోత్ దేవిక, ధర్మారపు వెంకన్న, చీకటి మహేశ్, బుల్లెట్ కృష్ణ, లింగంనాయక్, భాస్కర్, గంగాధర్, సుధాకర్, హుస్సేన్, బి.రమేశ్ పాల్గొన్నారు.

● గార్ల : రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పట్ల గళమెత్తే నాయకుడు బీజేపీ శాసన మండలి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్సీ రాష్ట్ర పరిశీలకురాలు హైమారెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ గార్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులు బీజేపీకి ఓట్లు వేసి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని బలపర్చాలన్నారు. బీజేపీ రాష్ట్ర యువజన మోర్చా కార్యదర్శి విమల్‌కుమార్ జైన్, సీతంపేట ఎంపీటీసీ నాగమణి, అజ్మీరా సుమలత, జంపాల శ్రీను, నాగరాజు, దేవా నాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తొర్రూరు, మే 20: గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. తొర్రూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1వ తారీఖునే వేతనాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెబున్న సీఎం రేవంత్ రెడ్డి గత 5 నెలలుగా పంచాయతీ ఉద్యోగులకు, సిబ్బంది వేతన బాధలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం పనిచేస్తున్న వారిని పట్టించుకోకపోవడం సరికాదని, పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.లేనిచో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాండ్య బీకు, సోమనర్సయ్య ప్రమోద్, యాకన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా సీపీఐ జెండా

మహబూబాబాద్ టౌన్, మే 20: నిరంతరం పోరాడే సీపీఐ జెండా పేద ప్రజలకు అండగా నిలుస్తుందనిజిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురంలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మేడేను నిర్వహించారు. సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకులు పడాల దేవయ్య, ఏఐటీయూసీ జెండాను వేల్పుల వీరన్న ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ... కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రధాని మోదీ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని, జూన్ 4న వెలువడే లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు బీజేపీని ఓడిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించిన మాజీ సీఎం కేసీఆర్‌ను గద్దె దించడంలో సీపీఐ ప్రధాన భూమిక పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, వీరమల్ల రవీంద్రయ్య, చిట్టిమల్ల రాంచంద్రు, గంట వెంకన్న, లచ్చయ్య, అబ్దుల్లా, సారయ్య, సైదులు, రమేష్, అశోక్, బాలరాజు, రాంజీ పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాంలు సకాలంలో అందించాలి : డీఈవో

మహబూబాబాద్ రూరల్, మే 20 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంను కుట్టించేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించిందని, వాటిని సకాలంలో అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ ఎమ్మార్సీలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు స్కూల్ యూనిఫాం క్లాత్‌ను అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... మహిళా సంఘాల్లో ఉండే మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం స్కూల్ యూనిఫాంను కుట్టే బాధ్యతను వారికి అప్పగించిందన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేసి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్, రాజేశ్వర్, సీఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● డోర్నకల్ : మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసే స్కూల్ యూనిఫాం క్లాత్‌ను సోమవారం డోర్నకల్ ఎమ్మార్సీ భవనంలో మహిళా సంఘాల బాధ్యులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫాంను మహిళా సంఘాలచే కుట్టించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో స్వయం సహాయక సంఘాలకు క్లాత్‌ను అందజేసినట్లు సెర్ప్ డీపీఎం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీలు రాధ, నళిని, స్వర్ణలత, కవిత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పితృదేవతలకు గిరిజన సంప్రదాయంలో పూజలు

- ఏటా కొనసాగుతున్న వింత ఆచారం


పితృదేవతలకు నైవేద్యం తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన పొయ్యిలు

కేసముద్రం, మే 20 : కేసముద్రం మండలం ధన్నసరి శివారు సబ్‌స్టేషన్ తండాలో సోమవారం గుగులోత్ వంశీయులు తమ పితృదేవతలను స్మరిస్తూ గిరిజన సంప్రదాయంలో పూజలు నిర్వహించారు. అందరూ ఉదయం నుంచి పూజలు నిర్వహించి ఉపవాసం ఉన్నారు. ఒకే చోట ప్రతీ ఇంటికి ఒక పొయ్యి చొప్పున భూమిలో తవ్వి వెలిగించి పప్పు, అన్నం నైవేద్యంగా వండారు. ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో జెండాలతో, డప్పుచప్పుళ్లతో ప్రదక్షిణలు చేశారు. ఈ నైవేద్యాన్ని తమ పితృదేవతలకు సమర్పించిన అనంతరం బంధువులను పిలుచుకొని విందు ఆరగించారు. ప్రతీ ఏటా తండాలో ఈ ఆచారం కొనసాగిస్తున్నట్లు గిరిజనులు తెలిపారు. మాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుగులోత్ సూక్య, మంజ్యా, వీరన్న, సూర్య, ఈన, బుజ, బద్యా, వంద మంది వరకు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

కురవి, మే 20 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని డోర్నకల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజినీకాంత్ అన్నారు. ఈ మేరకు కురవిలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎస్.రాజేందర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలగాని శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, చిన్నం గణేష్, బెడద విశ్వనాథం, ఎర్ర నాగేశ్వర్‌రావు, బాదె వీరభద్రం, బెడద కృష్ణమూర్తి, కంచం నాగరాజు, దయ్యాల శ్రీధర్, సీహెచ్. మోహన్, కట్యాల వీరన్న పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి జలాభిషేకం

తొర్రూరు రూరల్, మే 20 : తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో గంగపుత్రులు గంగమ్మతల్లి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా గంగపుత్ర సంఘం నాయకులు ప్రత్యేకమైన తెల్లటి దుస్తువులు ధరించి జలబిందెలు, మంగళహారతులు, డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ, గంగపుత్ర సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

లోతైన దుక్కులు దున్నుకోవాలి

మరిపెడరూరల్, మే 20: వేసవిలో రైతులు లోతైన దుక్కులు దున్నుకోవాలని మండల వ్యవసాయా అధికారి బి.వీరాసింగ్ అన్నారు. మండలంలోని తానంచర్ల రెవెన్యూ పరిధిలోని వాల్యా తండాలో సోమవారం ఓ రైతు నాగలితో దుక్కులు దున్నడాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడారు. తొలకరి వర్షాల వలన రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమై దుక్కులు దున్నడం, పొలాల్లో చెత్తాచెదారం శుభ్రం చేసుకుంటున్నారన్నారు. రైతులు లోతైన దుక్కులు దున్నడం ద్వారా క్రిమికీటకాలు, గుడ్లు, వాటి లార్వా దశలో ఉన్నటువంటి పురుగులు చనిపోతాయని తెలిపారు.

ఇంటర్‌సిటీ, మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్‌కు వినతి

కేసముద్రం, మే 20 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ, మణుగూరు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ సికింద్రాబాద్‌లో సోమవారం రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఎంతో అవసరమని అన్నారు. అలాగే రైల్వే ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల సౌకర్యం కోసం డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు బండారు దయాకర్, గుగులోత్ దస్రూనాయక్, రావుల మురళి, చిదిరాల వసంతరావు, బనిశెట్టి వెంకటేష్, భూలోకరెడ్డి, జె.దేవేందర్‌రెడ్డి, పొలెపల్లి పుల్లారెడ్డి ఉన్నారు.

ఘనంగా శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలు


మహబూబాబాద్‌లో శంకర్‌నాయక్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

మహబూబాబాద్ టౌన్, మే 20 : మహబూబాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తన స్వగృహంలో బీఆర్‌ఎస్ శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు ఆయనకు బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ... ప్రజాసేవ కోసం తాను ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. తనను ఆదరించిన బీఆర్‌ఎస్ శ్రేణులకు, మానుకోట నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్, నాయకులు రామరాజు యాకన్న, లూనావత్ అశోక్‌నాయక్, నర్సింగం వెంకన్న, భూక్య సునిత, కత్తుల ఎలేందర్, మంగళంపల్లి రాజ్‌కుమార్, నీలందుర్గేష్, సందెవీరన్న, రాజు, సంతోష్, నలమాస సాయి, కిషన్, షర్ఫుద్దీన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

● మునిసిపల్ 27వ వార్డులో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అక్కినపల్లి ఈశ్వర్, సట్ల రాజు, నిమ్మల వేణు, శేఖర్, నీలం యాదగిరి, రాజేష్, కార్తీక్, భూపతి, సాయి, మధు, మహేష్, రమేష్, స్వాతగ్ పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కముటం శ్రీను, అధికార ప్రతినిధి మోడెం రవీందర్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, కొమ్ము రాహుల్, ఎన్నమాల ప్రభాకర్, లింగాల పిచ్చయ్య, కూన భద్రాద్రి, పనికెర కొమురయ్య, పందుల సంజీవ, గాజగోని వీరన్న, ధరావత్ భీమ, మేకల సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్, మే 20 : మండలంలోని కంఠాయపాలెంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన కాంగ్రెస్ మహిళ డొనుక కొమురమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సోమవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, మృతురాలి కుమారుడు డొనుక కొమురయ్యను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, పెద్దగాని సోమన్న, కిషన్, మోకాటి వెంకన్న, కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

30 లోగా పనులు పూర్తి చేయాలి : ఎంపీడీవో

కొత్తగూడ, మే 20 : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను మే 30వ తేదీ లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రవీంద్రప్రసాద్ అధికారులకు సూచించారు. ముస్మి, దురారం, రామన్నగూడెం, లడాయిగడ్డ, కొర్రతండా, వాల్యతండా పాఠశాలల్లో చేపట్టిన పనులను ఎంపీడీవో రవీంద్రప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఫ్లోరింగ్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండల నోడల్ అధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ వాసం వీరాస్వామి, కార్యదర్శి సుమన్, సీఆర్పీ వెంకన్న పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలి

తొర్రూరు, మే 20: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు, అభివృద్ధి కోసం చేస్తున్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ ఆదేశించారు. సోమవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా జూన్ 1వ తేదీ లోపు పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా పనులను పూర్తి చేయాలన్నారు. లేనిచో శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు ఉండవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ నోడల్ అధికారి మహంకాళి బుచ్చయ్య, ఏపీఎం సంజీవరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

● తొర్రూరు రూరల్ : పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ ఆదేశించారు. తొర్రూరు మండలం అమర్‌సింగ్ తండా, కర్రెబిక్యాతండా, కేమ్లా, కర్కాల, వెంకటాపురం పాఠశాలలను సోమవారంసందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సిలార్ సాహెబ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం మంజూరీ చేసిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల నోడల్ ఆఫీసర్, బుచ్చయ్య, ఏపీఎం సంజీవ రావు, హెచ్‌ఎంలు, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

వీల్‌చైర్ బహూకరణ

చిన్నగూడూరు, మే 20: మండలంలోని మేగ్యాతండా గ్రామపంచాయతీ శివారు చిన్నతేజ తండాకు చెందిన బానోత్ భాస్కర్ కుమార్తె స్రవంతి (13) పుట్టుకతో దివ్యాంగురాలు. గ్రామ మాజీ వార్డు సభ్యుడు బాదావత్ సురేష్ అందమైన నా కుటుంబం అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కురవి మండలానికి చెందిన యువకులకు స్రవంతి వివరాలు పంపాడు. స్పందించిన గ్రూప్ సభ్యులు రఘు, ప్రశాంత్ రూ.5 వేల విలువైన వీల్‌చైర్‌ను స్రవంతికి సోమవారం బహూకరించారు. అనంతరం వారికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ మాజీ కారోబార్ మృతి


నర్సయ్య (ఫైల్)

కొత్తగూడ, మే 20 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పొగుళ్లపల్లి జీపీ మాజీ కారోబార్ గుగ్గిళ్ల నర్సయ్య(35) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చేందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పొగుళ్లపల్లి జీపీలో కారోబార్‌గా పనిచేసిన నర్సయ్య గత కొన్ని రోజుల క్రితం అదే గ్రామానికిచెందిన గద్ద అశోక్ గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం తీయమని చెబితే తీశాడు. తాళం తీసినందుకు నమోదు చేసిన కేసులో నర్సయ్య జైలుకు వెళ్లాడు. దాని వలన కారోబార్ విధుల నుంచి తొలగించబడ్డాడు. నాటి నుంచి మనస్తాపానికి గురైన నర్సయ్య శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు గమనించి వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా, ఆదివారం రాత్రి నర్సయ్య మృతి చెందాడు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ భోజ్యానాయక్ తెలిపారు. ఆయనకు కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, గత మార్చి 19న మండలంలోని చిట్యాలగడ్డకు చెందిన వంకాయల కార్తీక్‌ను పొగుళ్లపల్లి జీపీలో బంధించి దాడి చేసిన ఘటనలో గుగ్గిళ్ల నర్సయ్య నిందితుడు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

మహబూబాబాద్ టౌన్, మే 20 : నూతన విద్యా సంవత్సరంలో కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు గుగులోతు సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం సింహాద్రి అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని కోరారు. తరుణ్, పరమేష్, ప్రవీణ్, దినేష్, కార్తీక్, వినయ్ పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లుల 'పవర్ హాలిడే'

(3వ పేజీ తరువాయి)

పరిస్థితుల్లో పరిశ్రమలు బంద్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తుంది. విద్యుత్ కొరత ఉండడంతో 2012లో ఒకసారి ప్రభుత్వమే నెల రోజుల పాటు పవర్ హాలిడే ప్రకటించింది. ఇలా పరిశ్రమలను తాత్కాలికంగా మూసివేయడాన్ని 'పవర్ హాలిడే'గా పిలుస్తారు. పవర్ హాలీడే నాలుగు నుంచి ఆరు నెలలపాటు యాజమాన్యాలు పెట్టుకునే వీలుంది. పవర్ హాలీడే కాలంలో మిల్లు పూర్తిగా బంద్ ఉంటుంది. దీంతో కరెంటు బిల్లు నామమాత్రంగా నిర్దిష్టంగా ఉంటుంది. ఉదాహరణకు కేసముద్రంలోని ఒక జిన్నింగ్ మిల్లు నెలలో ఐదు రోజులు నడిపించినప్పటికీ ఆ నెలకు రూ.1,05,000 బిల్లు వస్తోంది. పవర్ హాలిడేలో అయితే మిల్లు బంద్ ఉన్నప్పటికీ నెలకు రూ.35వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే మిల్లులో కార్మికులకు నెలకు రూ.70వేల వేతనాలు ఇవ్వాల్సివస్తోంది. పవర్ హాలిడే కార్మికులకు సెలవులు ఇవ్వడం వల్ల వారి వేతనాల భారం మిగులుతుంది. మిల్లు బంద్ ఉన్నా పవర్ బిల్లును తగ్గించుకునే క్రమంలో సెలవులు ఇస్తున్నందున ఇలా బంద్ ఉన్న కాలాన్ని 'పవర్ హాలిడే'గా పిలవబడుతోంది. ఇందుకోసం మార్చి 31లోపు సంబంధిత విద్యుత్ అధికారులకు మిల్లు నుంచి లిఖితపూర్వకంగా ముందస్తు లేఖలు పంపించాల్సి ఉంటుంది. ఇలా జిల్లాలోని ఆరు జిన్నింగ్ మిల్లులు ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పవర్ హాలిడే కోసం అనుమతి కోరుతూ విన్నవించినట్లు కేసముద్రం మండల కాటన్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా ఉపవైద్యాధికారి

కేసముద్రం, మే 20 : కేసముద్రం పీహెచ్‌సీ, తాళ్లపూసపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అంబరీష సోమవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. తాళ్లపూసపల్లి ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రహరీని నిర్మించాలని సీపీఎం నాయకుడు గొడిశాల వెంకన్న అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సీహెచ్‌వో కృష్ణార్జున, ఎస్‌యూవో శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

నెల్లికుదురు, మే 20: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకటరెడ్డి అన్నారు. నెల్లికుదురులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యలయంలో సోమవారం వారు మాట్లాడుతూ పోలీసులు, రెవిన్యూ అధికారుల సహకారంతో ఇసుక రవాణా జరుగుతుందన్నారు. పోలీసులు కాంగ్రెస్ నాయకుల ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయకుండా పట్టుకొని వదిలివేస్తున్నారన్నారు. నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపెల్లి, మునిగలవీడు, మదనతుర్తి ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతందన్నారు. పోలీసులు మామూళ్లకు పాల్పడుతూ ఇసుక రవాణాకు సహకరిస్తున్నారన్నారు. ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవాలని 100కు డయల్ చేసినా స్పందించని పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో నాయకులు కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, యాసం రమేష్, బత్తిని అనిల్, వెన్నాకుల శ్రీనివాస్, పులి రామచంద్రు, భూక్య బాలాజీ, హెచ్.అశ్విన్, బొల్లు మురళి, భీముడు, భోజ్యానాయక్, కొమ్ము అనిల్,అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలి


పెద్దవంగరలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

పెద్దవంగర, మే 20 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జీసీసీ మాజీ చైర్మన్ దారవత్ గాంధీనాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఉప ఎన్నికలో నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలర్ అని, అతడిని నమ్మి పట్టభద్రులు మోసపోవద్దన్నారు. విద్యావంతులైన పట్టభద్రులంతా పోరాడే పటిమ ఉన్న రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, వెంకన్న, చింతల భాస్కర్, శ్రీరాం సుధీర్, సమ్మయ్య, హరీష్, రాంమూర్తి, అనిల్, అనుదీప్, వెంకటేష్, దయాకర్, భిక్షపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● కురవి: పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కురవిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోట లాలయ్య, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్దన్‌రెడ్డి, గుగులోతు రవి, అనిల్, సందీప్, యాకయ్య, రమేష్, లింగన్న, సాదిక్ పాల్గొన్నారు.